డీఈవో వైఖరి మార్చుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 24 : జిల్లాలోని ప్రధానోపాధ్యాయులపై డీఈవో తన వైఖరి మార్చుకోవాలని పీఆర్‌టీయూ నాయకులు ఏటుకూరి శ్రీనివాస రావు, ఆడే ప్రకాశ్‌లు శుక్రవారం డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విద్యాశాఖలో అన్ని రకాల పనులు మన ఊరు-మనబడి , డైస్ , బిల్స్, వివిధ రకాల సెలవులు మంజూరు చేయడంలో అనుభవం ఉన్న సీనియర్ ప్రధానోపాధ్యాయులకు మాత్రమే నియమించాలి లేదా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్‌కు, జిల్లాలోని రెగ్యులర్ మండల విద్యాశాఖ అధికారులకు మాత్రమే కేటాయించాలి. కానీ నిభంధనలు పాటించకుండా జూనియర్ ప్రధానోపాధ్యాయులను నియమించడం సరికాదన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వివిధ ఎంక్వైరీలపై జూనియర్ ప్రధానోపాధ్యాయుల పేర్లను తొలగించాలని తెలిపారు.

నకిలీ విత్తనాలతో నష్టపోవద్దు

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో శ్రీధర్

బెజ్జూర్, మే 24 : వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు నకిలీ విత్తనాలను వాడి నష్టపోవద్దని వ్యవసాయ విస్తరణాధికారి శ్రీధర్ సూచించారు. మండలంలోని సోమిని క్లస్టర్‌లోని రైతు వేదికలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. లైసెన్సులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాల ప్యాకింగ్, కంపెనీ పేరు తదితర వివరాలను పరిశీలించాలని తెలిపారు. బిల్లులను తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నెలాఖరుకల్లా కొనుగోళ్లు పూర్తిచేస్తాం

ధాన్యం పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సత్యనారాయణరెడ్డి

దహెగాం, మే 24 : ఈ నెలాఖరుకల్లా పూర్తిస్థాయిలో వడ్ల కొనుగోళ్లు చేపడుతామని కొనుగోళ్ల ప్రత్యేకాధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని లగ్గాం, చౌక పంచాయతీల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి, కాంటా చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తేమ శాతం నిర్ధారించి, సర్టిఫైచేయాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున ప్రతీ రైతు ధాన్యం కాంటలు చేసి, మిల్లులకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో చప్పిడ బక్కయ్య, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

సమావేశానికి హాజరైన కొన్ని శాఖల అధికారులు

బెల్లంపల్లి, మే 24 : కోరం లేక బెల్లంపల్లి మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాలేదని, కేవలం కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారని ఎంపీడీవో రాజేందర్ వెల్లడించారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని వివరించారు.

సాగుకు సన్నద్ధం..

- దుక్కులు దున్నే పనిలో రైతులు నిమగ్నం
- వరి, పత్తి పంటలకు ప్రాధాన్యం

నార్లాపూర్ శివారులో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

మందమర్రి, మే 24 : రైతులు వానకాలం సాగుకు సమాయత్తమవుతున్నారు. మరికొన్ని రోజుల్లో రుతుపవనాలు వచ్చే అవకాశం ఉండడంతో సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. వేసవి దుక్కులు దున్నిస్తే పంటల సాగుకు అన్ని విధాలా ప్రయోజనముంటుందని రైతులు భావిస్తున్నారు. మందమర్రిలోని నార్లాపూర్, ఊరు రామకృష్ణాపూర్, ఎర్రగుంటపల్లి, ఊరు మందమర్రి, చొప్పరిపల్లి, చతులాపూర్ గ్రామాల రైతులు ట్రాక్టర్లతో దుక్కులు దున్నించి, భూములను సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో సుమారు 480 రైతు కుటుంబాలుండగా, సుమారు 1500 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. గ్రామాల సమీపంలోని చెరువుల ఆయకట్టు రైతులతో పాటు బోర్లు, విద్యుత్ సౌకర్యం ఉన్నవారు వరి సాగుకు సమాయాత్తమవుతుండగా, వర్షాలపై ఆధారపడే వారు పత్తి మక్క లాంటి ఆరుతడి పంటలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయా గ్రామాల్లో యేటా 500 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, 800 ఎకరాలలో పత్తి వేస్తున్నారు. చిన్న సన్నకారు రైతులు సుమారు 200 ఎకరాల్లో కూరగాయలు, పప్పు ధాన్యాలు పండిస్తున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు అనుకూలిస్తే పత్తి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. దుకాణాల్లో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని, మేలు రకం విత్తనాలను వేయాలని అవగాహన కల్పిస్తున్నారు. పంట మార్పిడి విధానం పాటించి, అవసరమైన మేరకు ఎరువులు వాడాలని, సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసిన వెంటనే భూసారాన్ని పెంచేందుకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు కార్యాయంలో సంప్రదించి తీసుకెళ్లాలని సూచిస్తున్నారు.

సరైన సమయంలో టీకాలు అందించాలి

- మంచిర్యాల ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత
- జిల్లాలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాల ఏసీసీ, మే 24 : సరైన సమయంలో ప్రతి ఒక్కరికీ టీకాలను అందించాలని మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అనిత అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ప్రభుత్వ దవాఖానలో ఏఈఎఫ్ఐ రోగనిరోధకత ఇమ్యునైజేషన్ తర్వాత వచ్చే ప్రతికూల సంఘటనలపై కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఇమ్యునైజేషన్ తర్వాత వచ్చే ప్రతికూల సంఘటనలను జరుగకుండా వందశాతం సంపూర్ణ టీకాలు ఇవ్వవచ్చునన్నారు. టీకాల వల్ల అనర్థాలు రాకుండా ఉండేందుకు తల్లులకు ఇంటి పెద్దలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతీ ఆరోగ్య కార్యకర్త వెంబడి కిట్టు ఉంచుకోవాలన్నారు. ప్రతీ బుధ, శనివారం జరిగే టీకాల కార్యక్రమాల్లో ఆరోగ్య కార్యకర్తలు వంద శాతం టీకాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కమిటీ సమావేశంలో మూడు ఏఈఎఫ్ఐ కేసులను సమీక్ష చేశారు. అనంతరం టీకా నాణ్యత లోపం, రోగ నిరోధకత మొదలైన వాటిపై సమీక్ష చేసి, వైద్య ఆరోగ్య శాఖకు తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్ఎంవో డా భీష్మ, వైద్యులు శ్రీకాంత్, అలివేణి, పీ సురేందర్ రెడ్డి, ఫయాజ్, నిత్య, కృష్ణ, మనోజ్ కుమార్, డెమో వెంకటేశ్వర్లు, ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలంగాణ రాష్ట్ర కన్సల్టెంట్ అతుల్పినిగం తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి ఎంపిక

మందమర్రి రూరల్, మే 24 : జాతీయ ప్రతిభా పురస్కారం కింద కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్ ఎంఎంఎస్ ఉపకార వేతనం పొందేందుకు మందమర్రి ఆదర్శ(మోడల్) పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన బీ స్రినిత్ వర్మ, కే విక్షిత్, కే సిద్ధార్థ, పీ హర్ష శ్రీ, బీ రిశ్విత్, బీ సాత్విక్ వర్మ, ఎన్ హారిక, ఎస్ హర్షవర్ధన్, ఎండీ ఛహత్, ఎస్కే అదినా ఫిర్దోస్‌కు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందనుందని ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి తెలిపారు. మంచిర్యాల జిల్లాలోనే మందమర్రి మోడల్ స్కూల్ వరుసగా రెండోసారి కూడా ద్వితీయ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, సిబ్బందిని వారు అభినందించారు.

బలరావుపేట విద్యార్థి..

లక్షెట్టిపేట,మే24: మండలంలోని బలరావుపేట గ్రామానికి చెందిన బైరి అక్షిత్ నేషనల్ మెయిన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. మండలంలోని జెండావెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పూర్తిచేసిన అక్షిత్ ఇటీవల ఎన్ఎంఎంఎస్ నిర్వహించిన పరీక్షలో ప్రతిభ చూపాడు. కాగా, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సిర్పూర్(టీ) ఎంపీపీగా సత్యనారాయణ

నియామక పత్రం చూపిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీటీసీలు

సిర్పూర్(టీ), మే 24 : సిర్పూర్(టీ) ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్ ఆధ్వర్యంలో ఎంపీపీగా ఈర్త సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్డీవో సురేశ్ మాట్లాడుతూ.. 8 మంది ఎంపీటీసీలకు ఏడుగురు ఎంపీటీసీ (ఈర్త సత్యనారాయణతో పాటు సుహేల్ అహ్మద్, తుకారాం, మంగీలాల్, ఎల్ములే సరిత, కారం శైలజ, తాహేరా బెగం) సభ్యులు హాజరైనట్లు తెలిపారు. అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘానికి పంపించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. తనకు సహకరించిన, ఎంపీపీగా అవకాశం ఇచ్చిన ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనకు ఎంపీటీసీలు, ఎంపీడీవో సత్యనారాయణ అభినందనలు తెలిపారు. సిర్పూర్(టీ) ఎస్ఐ దీకొండ రమేశ్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈదురుగాలులకు ఇంటిపై పడ్డ చెట్టు

ఇంటిపై విరిగిపడ్డ చెట్టు

దండేపల్లి, మే 24 : దండేపల్లి మండలం చింతపల్లి గ్రామంలో ఈదురుగాలులకు లింగాల నాగయ్య ఇంటిపై చెట్టు విరిగిపడింది. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగులాలు రావడంతో ప్రమాదం జరిగింది. ఆ సమయంలో నాగయ్యతో పాటు భార్య కూడా ఉండగా, స్వల్పగాయాలతో బయటపడ్డారు.

పనుల పరిశీలన

వేమనపల్లి, మే 24 : వేమనపల్లి మండలం జిల్లెడ, జక్కెపల్లి, సూరారం, లక్ష్మీపూర్ గ్రామాల్లోని అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలల్లో పనులను ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, కార్యదర్శులు హరినాథ్, వెంకటేశ్, సబ్ కాంట్రాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

శ్రీరాంపూర్, మే 24 : శ్రీరాంపూర్ అరుణక్కనగర్‌కు చెందిన బల్ల మల్లయ్య మద్యం మత్తులో గురువారం రాత్రి మంచిర్యాల రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, బ్లూ కోల్ట్ పోలీస్ సిబ్బంది కాపాడి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య అతిగా మద్యం తాగి, భార్యాపిల్లలతో గొడవపడ్డాడు. మంచిర్యాల రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి, ఆత్మహత్య చేసుకుంటున్నానని భార్యకు ఫోన్ చేశాడు. ఆమె వెంటనే డయల్ 100కు సమాచారం ఇచ్చి, తన భర్తను కాపాడాలని కోరింది. వెంటనే శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్.. మల్లయ్య ఫోన్ లొకేషన్ ట్రేస్ చేసి, గుర్తించారు. వెంటనే బ్లూకోల్ట్ సిబ్బంది సత్యనారాయణ, గోవిందర్‌సింగ్, హోంగార్డు హనుమండ్లు మల్లయ్యను గుర్తించి, కాపాడారు.

స్వీపర్, స్కావెంజర్ పోస్టుల నోటిఫికేషన్ రద్దు

తాండూర్, మే 24 : తాండూర్ కేజీబీవీలో ఖాళీగా ఉన్న స్వీపర్, స్కావెంజర్ పోస్టులకు జనవరి 2న విడుదల చేసిన నోటిఫికేషన్‌ను కలెక్టర్, మంచిర్యాల డీఈవో ఆదేశాల ప్రకారం రద్దు చేస్తున్నట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారుల సూచనల మేరకు తదుపరి నోటిఫికేషన్ ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గమనించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, మే 24 : టీజీఎస్‌డబ్ల్యూర్‌ఈఐ ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని నాన్ సీవోఈ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో-ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31 వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని వివరించారు.

కంపోస్టు తయారీ కొనసాగించాలి

కోటపల్లి, మే 24 : గ్రామ పంచాయతీల్లో కంపోస్టు ఎరువుల తయారీ ప్రక్రియను కొనసాగించాలని డీఎల్పీవో ధర్మారాణి అన్నారు. కోటపల్లి మండలంలోని షట్‌పల్లి, పంగిడిసోమారం, మల్లంపేట పంచాయతీలను డీఎల్పీవో సందర్శించారు. కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. పంచాయతీల్లో సేకరించిన వ్యర్థాల ద్వారా ఎరువులను తయారు చేయాలని సూచించారు. అనంతరం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. శంకర్, సత్యనారాయణ, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

జన్నారం, మే 24 : మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన అమ్జద్‌ఖాన్ జ్ఞాపకార్థం నిర్వహించి క్రికెట్ పోటీల్లో విజేతలకు ఎస్ఐ రాజవర్ధన్ బహుమతులు అందజేశారు. కిష్టాపూర్ జట్టుకు(ప్రథమ) రూ.10 వేలు, షీల్డ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, మిక్కిలినేని రాజశేఖర్, ఇసాక్, నిర్వాహకులు అక్రంఖాన్, షాకీర్‌అలీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటపల్లి, మే 24 : కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామ సమీపంలోని ప్రాణహిత నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వెలమపల్లి సమీపంలోని సిమెంట్ ఇటుకల తయారీకి ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గ్రామస్తులు ట్రాక్టర్లను పట్టుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చండీ హోమంలో సివిల్ జడ్జి దంపతులు

ఆసిఫాబాద్ టౌన్, మే 24 : జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవి మాత ప్రతిష్ట సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ దంపతులతో పాటు దాదాపు 20కి పైగా జంటలు పాల్గొన్నారు. సిద్దిపేటకు చెందిన మునికొండ నాగరాజ్ శర్మ ఆధ్వర్యంలో హోమం అంగరంగ వైభవంగా సాగింది.

ఉరేసుకొని ఇద్దరి ఆత్మహత్య

కోట రాజేశ్(ఫైల్)

కోటపల్లి, మే 24 : కోటపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామ సమీపంలోని ఇటుకల తయారీ కేంద్రంలో శుక్రవారం ఇద్దరు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన కోట రాజేశ్ (30), నాయిని చీకటి (40) కొంతకాలంగా సహజీవనం సాగిస్తున్నారు. లక్ష్మీపూర్ గ్రామ సమీపంలోని సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రంలో ఉంటూ పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో సిమెంట్ గాజులు, ఫోల్స్ తయారు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పని ముగించుకొని వారు నివాసం ఉంటున్న ప్రాంతానికి వెళ్లారు. సాయంత్రం వరకు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు ఇంట్లో చూడగా, దూలానికి ఉరేసుకొని కనిపించారు. వెంటనే పోలీసులకు తెలియజేయడంతో చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఏఎస్ఐ కాంతారావ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

I, P. PADMA (old name) D/O: Odelu @ Nimmathi Renuka, w/o: Nimmathi Ramesh, R/o: H.No: 30-2, Abraham Nagar, Mandamarri mandal, Mancherial Dist, after marriage my name was changed to NIMMATHI RENUKA (New Name) w/o: Nimmathi Ramesh, for all purpose.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సన్మానం

శిక్షణ ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంపీపీ శశికళ

జన్నారం, మే 24 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి శిక్షణ కోసం వచ్చి శిక్షణ పూర్తి చేసుకున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల(సురేంద్ర స్వరూప్, భిజ్జి రాజ్ మిశ్రా, విశాల్ దకడ్, నిఖిల్ జూన్, శివం)ను ఎంపీడీవో శశికళ సన్మానించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ.. గ్రామాన్ని సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇక్కడ నేర్చుకున్న అన్ని జ్ఞాపకాలు నిజజీవితంలో ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రవీందర్, మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఈతతో ఉపశమనం

ఈత కొడుతున్న యువకులు

వాంకిడి,మే 24: ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నారులు మొదులుకొని పెద్దల వరకు మధ్యాహ్నం కెనల్‌లు, చెరువుల్లో ఉత్సాహంగా ఈత కొడుతున్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో కొందరు చిన్నారులు ప్లాస్టిక్ డబ్బాలు, ట్యూబ్‌లు నడుముకు కట్టుకుని ఈత నేర్చుకుంటున్నారు. శుక్రవారం ఉదయం వాంకిడి కుర్డు గ్రామ సమీపంలోని కెనాల్‌లో యువకులు, చిన్నారులు ఉల్లాసంగా ఈత కొడుతూ కనిపించారు.

ఇబ్బందులు కలుగకుండా చూడాలి

అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రవికుమార్

తాండూర్, మే 24 : ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వ్యాపారాలు చేసుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ దుకాణాదారులకు సూచించారు. తాండూర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సీఐ కుమారస్వామి, ఏఎస్ఐ, పోలీసుల ఆధ్వర్యంలో ఐబీ, బస్టాండ్ ఏరియాల్లోని దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. దుకాణాలు రోడ్డు మీదపెట్టవద్దని, ప్రతీ దుకాణంలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్, ఐబీ ఏరియా దుకాణదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాల పరిశీలన

లక్షెట్టిపేట, మే 24 : మండలంలోని బలరావుపేట, జెండావెంకటాపూర్ గ్రామాల్లోని కుట్టు శిక్షణ కేంద్రాలను శుక్రవారం ఎంపీడీవో సరోజ, ఎంపీవో ప్రసాద్ పరిశీలించారు. శిక్షణ కేంద్రాల్లో స్కూల్ పిల్లల కోసం అందజేస్తున్న యూనిఫాంలను సకాలంలో కుట్టి అందజేయాలన్నారు. అనంతరం గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించి, పనులు వేగంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కుట్టు శిక్షణ కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

ఒక్కరి ఆత్మహత్య

హాజీపూర్, మే 24 : దొనబండ గ్రామ శివారులోని ఆలయం వద్ద శుక్రవారం రాత్రి నరేండ్ల రాజ్ కుమార్ (30) ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దొనబండకు చెందిన రాజ్ కుమార్ టాటా ఏస్ ట్రాలీ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఏఎస్ఐ చాంద్ పాషా సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రాజ్‌కుమార్ మృతికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది. ఆయనకు భార్య అంజలి, కొడుకు అజయ్, బిడ్డ స్వప్న ఉన్నారు.

తొమ్మిది కుటుంబాలకు ఒక్కటే నల్లా

నల్లా వద్ద నీళ్లు పట్టుకుంటున్న తొమ్మిది కుటుంబాలు

జన్నారం, మే 24 : జన్నారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో నీళ్ల కోసం నిరసన తెలిపిన ఎస్సీ కాలనీ వాసులకు అధికారులు నల్లా కనెక్షన్ ఇచ్చారు. ఈ మేరకు 'నమస్తే'లో గురువారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కానీ, ఒకే ఒక్క నల్లా కనెక్షన్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తమ ఇండ్ల ముందు ఉన్న నల్లాలు మాత్రం ఇప్పటికీ పనిచేయడంలేదు. ప్రస్తుతం అందిస్తున్న ఒక నల్లాతో తొమ్మిది కుటుంబాలు ఒకరి తర్వాత ఒకరు పట్టుకుంటూ ఇబ్బందులుపడుతున్నారు. అందరి ఇండ్లకు మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చి, నీరు అందించాలని కాలనీవాసులు జాడి రవి, జాడి లక్ష్మి తదితరులు కోరుతున్నారు. అలాగే అదే గ్రామంలోని అంబేద్కర్‌నగర్, దుబ్బగూడలో బోర్లు పనిచేయడంలేదని, వాటిని బాగుచేయాలని ఆ కాలనీకి చెదిన మోల రామక్క, గంధం రాజన్న తదితరులు కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ సౌజన్య

మందమర్రి రూరల్, మే 24 : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్ర కో-ఆర్డినేటర్ సౌజన్య అన్నారు. మందమర్రి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మహిళలు ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, చట్టాలపై అవగాహన కలిగి ఉండకపోవడం బాధాకరమని అన్నారు. వేధింపులకు గురైతే 181 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఏపీఎం లలితా కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

అక్రమపట్టాలను రద్దు చేయాలి

వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకారులు

జన్నారం, మే 24 : మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఊర చెరువును అక్రమ పట్టాలు చేసుకున్న వాటిని రద్దు చేయాలని మత్స్య సహకార సంఘం నాయకులు నాగయ్య, సత్తయ్య కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే కొందరు చెరువులో భూమి పట్టాచేసుకున్నారని, రద్దుచేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో శ్రీనివాస్, తిరుపతి, భీమయ్య, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఇబ్బందులు పరిష్కరించాలి

జైపూర్, మే 24 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఇబ్బందులు పరిష్కరించాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి గోమాస ప్రకాశ్ అన్నారు. మండలంలోని టేకుమట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సభ్యులతో కలిసి సందర్శించారు. కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడారు. 20 రోజుల నుంచి రైతులు తెచ్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనే ఉన్నదని, లారీలు రాక రైతులు ఇబ్బందులకు గురువుతున్నారని తెలిపారు. కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని పేర్కొన్నారు. తడిసిన ధాన్యానికి తేమ శాతం పేరుతో అధిక మొత్తంలో కోత విధిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పాయిరాల రాములు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.